




# తమ్ముళ్లతో కలిసి భర్తను హత్య చేసిన భార్య

- ఐదుగురు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వరరావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

వనపర్తి రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) :వేధింపులు భరించలేక భార్యే భర్త హత్యకు పాల్పడింది. బుధవారం వనపర్తి పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. పాన్‌గల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన గడ్డం నర్సింహ(35) ప్లంబర్ పని చేస్తు జీవనాన్ని సాగిస్తుండేవాడు. కొన్ని నెలలుగా మద్యానికి అలవాటు పడి పని చేయకుండా డబ్బులు ఇవ్వాలని భార్య శివలీలను వేధించేవాడు. అతని వేధింపులు భరించలేక ఇటీవల ఆమె పుట్టింటికి (చెన్నారం)కి వెళ్లింది. అప్పటి నుంచి శివలీల చెన్నారంలోనే ఉంటుంది. దసరా పండుగ రోజు కుటుంబ సభ్యులతో కలిసి నర్సింహను చంపాలని ప్లానింగ్‌తో గ్రామానికి అతడిని పిలిపించారు. మద్యం తాగించి కళ్లల్లో కారం పొడి చల్లి డంబుల్‌తో గుద్ది చంపారు. మృతుడి అరుపులు బయటకు వినపడకుండా, అత్త పెంటమ్మ ఇంటి బయట స్పీకర్ బాక్సులతో భజన పాటలు పెద్దగా పెట్టి, ఇంట్లోకి ఎవరూ రాకుండా కాపలాగా ఉన్నది. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి ఆరు ఫోన్లు, కారు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ కృష్ణయ్య, రేవల్లి ఎస్ఐ రజిత, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## నా కూతురిది ఆత్మహత్య కాదు

- ఎవరో ఇంజక్షన్ ఇచ్చి హత్య చేశారు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన ప్రియాంక తండ్రి

7

## ఆ గ్రామాలను తరలించేందుకు కసరత్తు

6

- బాదారం అడవిలో పునరావాస స్థలాన్ని పరిశీలించిన అధికారులు

## అరుదైన వ్యాధితో చిన్నారి కన్నుమూత

7

# షెడ్యూల్ ప్రకారమే!

## నేటి నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ

- తొలి విడతలో 38 జడ్పీటీసీ, 420 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- కోర్టు స్టేకు నిరాకరించడంతో షెడ్యూల్ ప్రకారమే ప్రక్రియ షురూ
- ఇప్పటికే నామినేషన్ల స్వీకరణకు ఆయా మండలాల్లో ఏర్పాట్లు
- నేటి విచారణపై కూడా ఉత్కంఠ, స్టే ఇస్తే మాత్రమే ఆటంకం



నారాయణపేట జిల్లా పరిషత్ కార్యాలయం

మహబూబ్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : స్థానిక సంస్థల ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే నిర్వహించేందుకు మార్గం తాత్కాలికంగా సుగమమైంది. జీఓ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చేసిన రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కొందరు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి రిజర్వేషన్లు రద్దు చేసి ఎన్నికల ప్రక్రియ నిలుపుదల కోసం మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వాదనలు వినిపించారు. అయితే కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించడంతో పాటు విచారణను గురువారానికి వాయిదా వేయడంతో ముందుగా రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్ విడుదలై గురువారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇప్పటికే ఆయా మండల కేంద్రాల్లో ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఒకవేళ నేటి విచారణలో కోర్టు ఏదైనా జోక్యం చేసుకొని ఎన్నికల ప్రక్రియపై మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే తప్పా ఆగే ప్రసక్తే లేదనేది స్పష్టమవుతోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 77 జడ్పీటీసీ స్థానాలు, 800 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఇప్పటికే రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు విభజన చేశారు. మొదటి విడతలో 38 జడ్పీటీసీ స్థానాలు, 420 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. కోర్టు విచారణ తర్వాత అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.


మహబూబ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం

**మొదటి విడతలో ఇవే..**

రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు విడతల్లో, సర్పంచు ఎన్నికలు మూడు విడతల్లో జరుగనున్న విషయం తెలిసిందే. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే ఉన్న స్థానాలను రెండు విడతలుగా విభజించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 175 ఎంపీటీసీ, 16 జడ్పీటీసీ స్థానాలు ఉండగా.. మొదటి విడతలో 8 జడ్పీటీసీ, 89 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. బాలానగర్, భూత్పూరు, గండీడ్, మహ్మదాబాద్, జడ్చర్ల, మిడ్జిల్, నవాబ్‌పేట, రాజాపూర్ మండలాల్లో తొలి విడతలో నామినేషన్లను నేటి నుంచి స్వీకరించనున్నారు. గద్వాల జిల్లాలో 142 ఎంపీటీసీ, 13 జడ్పీటీసీ స్థానాలు ఉండగా తొలి విడతలో 5

(మిగతా 6లో..)

# బేస్మెంట్ బెంగ

- జియో ట్యాగింగ్ నిబంధనతో ఇందిరమ్మ ఇళ్లు పథకానికి నోచుకోని నిరుపేదలు
- గతంలోనే 608 బేస్మెంట్ నిర్మాణాలు
- పథకం వర్తించకపోవడంతో ఆవిరవుతున్న ఆశలు
- బేస్మెంట్ ఉంటే మంజూరు చేయరా అంటున్న అర్హులు..?

వనపర్తి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలుచేస్తోంది. ప్రతీ నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలను ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక చేసిన విడతల వారిగా నగదు వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తున్నారు. లబ్ధిదారులకు ఖాళీ స్థలం మాత్రమే ఉండాలని, బేస్మెంట్ నిర్మాణం చేసి ఉంటే వారిని అనర్హులుగా ప్రకటిస్తున్నారు. లేదంటే బేస్మెంట్ పూర్తిగా నెలమట్టం చేసి మళ్లీ మొదటి నుంచి (బేస్మెంట్) నిర్మాణం చేస్తేనే ఇందిరమ్మ ఇల్లు పథకానికి అర్హులవుతారని అధికారులు చెబుతున్నారు. దీంతో బేస్మెంట్ నిర్మాణం చేసుకున్న నిరుపేదలకు బెంగ పట్టుకున్నది.

**ఎదురుచూపులు..**

జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేందుకు అర్హులుగా మొదటి విడతలో 6,538 మందిని గుర్తించి ప్రొసిడింగ్ కాపీలు ఇచ్చారు. గుర్తించిన లబ్ధిదారుల్లో 608 మంది ఇప్పటికే బేస్మెంట్ కలిగి ఉన్నారు. కానీ బేస్మెంట్ తొలగించి, మళ్లీ మొదటి నుంచి పనులు ప్రారంభించాలని హౌసింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. జియో ట్యాగింగ్ నిబంధనతో బేస్మెంట్ ఉన్నవారు పథకానికి అనర్హులుగా వారు ప్రకటిస్తున్నారు.

**ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం**



ఇందిరమ్మ ఇల్లు పథకానికి ఎంపిక చేయకముందే బేస్మెంట్ కలిగి ఉన్న లబ్ధిదారుల వివరాలు ప్రభుత్వానికి పంపించాం. ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల అనుమతి ఇవ్వడం లేదు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే బేస్మెంట్ కలిగిన వారికి కూడా ఇళ్లు నిర్మించుకునేలా ఆదేశాలిస్తాం.

-విటోభా, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి, వనపర్తి

# సురవరం జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకం

- కొల్లాపూర్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తా: మంత్రి జూపల్లి


సురవరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

6

# శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

- రెండు గేట్ల ద్వారా 55,600 క్యూసెక్కులు దిగువకు విడుదల
- విద్యుత్ ఉత్పత్తి, లిఫ్ట్‌ల ద్వారా మరో 72 వేల క్యూసెక్కులు
- జూరాలకు 88 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 61 వేలు

6



# ప్రమాదవశాత్తు కూలిన బండరాళ్లు

- పనులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తుల మృతి
- మృతులు వనపర్తి జిల్లావాసులు

ప్రమాదంలో మీదపడిన బండరాయి

6


మృతి చెందిన బాలాలి (ఫైల్)


మృతి చెందిన కురుమూర్తి (ఫైల్)

# రైతు సంక్షేమం దిశగా అడుగులు

**- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్**


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం దిశగా నాగర్ కర్నూల్ జిల్లా ముందడుగు వేస్తోందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులకు ప్రధాన మంత్రి ధన్-ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎండీడీకేవై పథకానికి జిల్లా ఎంపిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ పథకం కింద రైతుల ఆదాయాన్ని పెంచడం, పంట ఉత్పత్తి, మార్కెటింగ్, నూతన ఆవిష్కరణ లు చేపట్టి జిల్లాను రాష్ట్ర, దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతీ శాఖ తమ భాగస్వామ్య బాధ్యతను గుర్తించి సమన్వయంతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల11న ప్రధాని ప్రారంభించనున్న పీఎండీడీకేవై పథకం కార్యక్రమాన్ని పాలెం వ్యవసాయ విశ్వ విద్యాలయంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అంతకు ముందు పీఎండీడీకేవై పథకానికి ఎంపికైన జిల్లాల కలెక్టర్లతో ఢిల్లీ నుంచి భారత వ్యవసాయ మంత్రిత్వశాఖ కార్యదర్శి దివేస్ చతుర్వేది వీసీ ద్వారా పథకం ముఖ్య ఉద్దేశాలను వివరించారు. వీసీకి నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు చేయూత ఏదీ..!

- శిలాఫలకాలకే పరిమితమైన చేనేతపార్కు
- 2008లో వైఎస్సార్, 2018లో కేటీఆర్‌లతో శంకుస్థాపన
- ఎదురుచూపులతోనే కాలం గడిపేస్తున్న కార్మికులు



గద్వాల చేనేత పార్కు ఏర్పాటుకు కేటాయించిన స్థలం

గద్వాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గద్వాల చేనేత జరీ చీరలకు దేశ విదేశాలలో మంచి గుర్తింపు ఉంది. ఇక్కడి కార్మికుల నైపుణ్యం, నాణ్యమైన ముడిసరుకుతో తయారు చేయడంతో గుర్తింపు వచ్చింది. ఉమ్మడి జిల్లాలో వేలాది మంది చేనేత కార్మికులు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నా ప్రభుత్వాలు మాత్రం వారిని ఆదుకోవడం లేదు. పథకాల పేరుతో వారిని ఆదుకుంటున్నామని చెబుతున్నా కార్మికుల ఆదాయం పెంచడంలో విఫలం అవుతున్నాయి. నమ్ముకున్న వృత్తితో కుటుంబాన్ని పోషించే పరిస్థితి లేకపోవడంతో చాలా మంది ఈ వృత్తిని విడిచి ఇతర పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది. మగ్గాలు పడిపోవడం, కార్మికుల సంఖ్య తగ్గిపోవడంతో ఉత్పత్తిపై ప్రభావం పడే పరిస్థితి ఉంది. గద్వాలలో చేనేత బతకాలంటే కార్మికులుకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, కొత్తకొత్త డిజైన్ల తయారీకి ఎలక్ట్రానిక్స్ జుకార్డ్ వంటి మిషన్లు సబ్సిడీపై అందించడం, హ్యాండ్‌లూమ్ పార్కుల అభివృద్ధి ఒక్కటే మార్గం. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు గద్వాల చేనేతను ఆదుకునేందుకు హ్యాండ్‌లూమ్ పార్క్‌ను మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. కానీ, 15 ఏళ్లుగా అడుగు ముందుకు పడటం లేదు.

**శిలాఫలకాలకే పరిమితం..**

గద్వాల చేనేత కార్మికులను ఆదుకునేందుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ప్రస్తుతం పాలమూరు ఎంపీ డీకే అరుణ గద్వాలకు హ్యాండ్‌లూమ్ పార్కును మంజూరు చేయించారు. గద్వాల మండలం పూడూరు శివారులో సర్వే నెంబరు 368/ఏలో 47.25 ఎకరాల భూమిని కేటాయించారు. ఇది గద్వాల - ఎర్రవల్లి ప్రధాన రహదారిపై ఉంటుంది. 2018, అక్టోబరు 5వ తేదీన వైఎస్సార్ చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే హద్దులు నిర్ణయించి

(మిగతా 6వ పేజీలో..)

# నేటి నుంచి రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ టోర్నీ

- 28 జిల్లాల నుంచి పాల్గొననున్న 1,200 మంది క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పాలమూరు జిల్లా కేంద్రం రాష్ట్ర స్థాయి క్రీడాసంబురానికి వేదిక కానుంది. జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్‌బాల్ టోర్నీని స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించనున్నారు. 9, 10న ట్రెడిషనల్, 10, 11న 3వ ఫస్ట్-5, 11, 12న మొదటి మిక్స్‌డ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. నాకౌట్ పద్ధతిలో డే నైట్ మ్యాచ్‌లు ఉంటాయి. స్టేడియం మైదానంలో ఏర్పాట్లను రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్రమ్ అదిత్యరెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం పరిశీలించారు.

**నాలుగు కోర్టుల ఏర్పాటు**

టోర్నీలో రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి 1,200 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. 100కు పైగా కోచ్ మేనేజర్లు, సాంకేతిక నిపుణులు హాజరుకానున్నారు. పోటీలకు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఏర్పాట్లు చేసింది. అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారుల సహకారంతో టోర్నీ నిర్వహించనున్నారు. ప్రధాన స్టేడి యం మైదానంలో నాలుగు కోర్టులు ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు అంబేడ్కర్ భవన్, స్కౌడ్స్ అండ్ గైడ్స్ భవనం, చైతన్య స్కూల్, లిటిల్‌స్కాలర్ స్కూల్, మహబూబ్‌నగర్ హైస్కూల్, మాడ్రన్ స్కూల్‌లో బస, స్టేడియంలో భోజన వసతి ఏర్పాటు చేశారు.

**విజయవంతంగా నిర్వహిస్తాం**

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీ విజయవంతం చేస్తాం. క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. 28 జిల్లాల నుంచి 1,200 మంది క్రీడాకారులు పాల్గొంటారు.

-విక్రమాదిత్యరెడ్డి, రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు



రైతులకు సూచనలు చేస్తున్న పాలెం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్‌చరణ్‌తేజ, మండల వ్యవసాయ అధికారి జి.మహేశ్‌రెడ్డి

## కేఎన్‌ఎం వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**» పాలెం శాస్త్రవేత్త డాక్టర్ చరణ్‌తేజ**

అమ్రాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేఎన్‌ఎం వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి పాలెం శాస్త్రవేత్త డాక్టర్ చరణ్‌తేజ అన్నారు. నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా జూన్ 2న ప్రభుత్వం పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం ద్వారా రైతులకు కేఎన్‌ఎం-1638 వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఇందుకు గాను బుధవారం మండల పరిధిలోని మన్ననూర్, మాచారం, కుమ్మరోనిపల్లి గ్రామాల్లో పాలెం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చరణ్‌తేజ ఆ విత్తనాలను సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేఎన్‌ఎం వరి పంట సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఆయన వివరించారు. మండల వ్యవసాయ అధికారి డాక్టర్ జి.మహేష్‌రెడ్డి, ఏఈఓలు ఉన్నారు.

## పెచ్చుమీరుతోన్న నాయకుల బెదిరింపులు

**» సూసైట్ నోట్ రాసి అదృశ్యమైన రమేశ్‌నాయక్**

**» ఆచూకీ కనిపెట్టడంతో పోలీసుల విఫలం**

**» మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**



మద్దూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి అండ చూసుకొని కొడంగల్ నియోజకవర్గంలో కొందరు అధికారి పార్టీ నాయకుల బెదిరింపులు పెచ్చుమీరుతున్నాయని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. వారి ఆగడాలు భరించలేక పలువురు ఇబ్బందులకు గురతున్నారన్నారు. మద్దూర్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్దూర్‌లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు యాసిన్, తాజొద్దీన్‌ల వేధింపులు భరించలేక ఓ గిరిజన బిడ్డ రమేష్‌నాయక్ ఏకంగా 17 పేజీల సూసైట్ నోట్ రాసి అదృశ్యమవ్వడం చూస్తే.. నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల జులుం ఎంతుందో తెలుస్తుందన్నారు. రమేశ్‌నాయక్ అదృశ్యమై పది రోజులు దాటుతున్నా పోలీసులు ఆచూకీని కనిపెట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. అదృశ్య మిస్టరీని పోలీసులు చేదించి, అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల నాయకులు సలీం, వీరారెడ్డి, గోపాల్ నాయక్, నీలి రాములు తదితరులు ఉన్నారు.

## అస్వస్థతకు గురై ఆవులు..

వెల్దండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని రాచూరు తండాలో 8 పాడి ఆవులు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తండాకు చెందిన పరుశకు 16 ఆవులున్నాయి. ఈ నెల 2న రెండు ఆవులు అస్వస్థతకు గురై, మరుసటి రోజు చనిపోయాయి. పశువైద్యాధికారి శ్యాంసుందర్ వాటికి పోస్టుమార్టం చేశారు. కలుషిత దాణా తినడం వల్ల అవి మృతి చెంది ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఆ తర్వాత రోజూ ఒకటి, రెండు చొప్పున మరో ఆరు ఆవులు చనిపోయాయి. పోస్టుమార్టం ద్వారా సేకరించిన నమూనాలను మహబూబ్‌నగర్ పశువ్యాధి నిర్ధారణ కేంద్రానికి పంపించినట్లు డాక్టర్ శ్యాంసుందర్ తెలిపాడు. మృతి చెందిన ఆవుల విలువ సుమారు రూ.6 లక్షల వరకు ఉంటుందని తెలిపాడు.

## ఉరి వేసుకొని దంపతుల ఆత్మహత్య



రమేష్, నిర్మల (ఫైల్)

భూత్పూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల మధ్య ఏమి గొడవలు జరిగాయో తెలియదు కానీ ఇద్దరూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన పోలెమోని మొగులయ్య, మణెమ్మలకు పోలె మోని రమేష్(30) అనే ఒకే కూమారుడు ఉన్నాడు. పోలెమోని రమేష్‌కు గోపాలపేట మండలంలోని సిరికూరు గ్రామానికి చెందిన నిర్మల అలియాస్ శ్రీలక్ష్మి (27)తో నాలుగు నెలల క్రితం వివాహ మైంది. నాలుగు నెలల పాటు వారి సంసారం అన్యోన్యంగా సాగిం ది. బుధవారం ఇద్దరి మ ధ్య ఏమి జరిగిందో తెలియదు కానీ రమేష్ తల్లి కూలి పనులకు వెళ్లగా తండ్రి శ్రీశైలం వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్యాభర్తలు ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డారు.

రెండు రోజుల క్రితం శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లిన పోలెమోని మొగులయ్య సాయంత్రం 8 గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంటి తలుపులకులో పలి నుంచి గడియ పెట్టుకొని ఉం డటంతో అనుమానం వచ్చి కిటీకీలో నుంచి చూశాడు. కొడుకు రమేష్ కిటీకీకి ఉరివేసుకొని వేలా డుతూ కనిపించాడు. అది చూ సి తండ్రి బోరున విలపిస్తూ ఇంటి. చుట్టుపక్కల వారిని పిలిచి తలుపును విరగ్గొట్టి లోపలికి వెళ్లి చూడగా కోడలు అంతకు ముందే ఉరివేసుకొని మంచంపై పడి ఉన్నది. విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీ సులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## రేపు సౌత్ జోన్ ఎంపికలు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూని వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల విద్యార్థులకు ఈనెల 10న యోగా మహిళలు, పురుషుల ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ గేమ్స్ ఎంపికల ను పీయూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు బుధవారం పీయూ పీడీ శ్రీని వాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు చెన్నైలోని వెల్స్ యూనివ ర్సిటీ, కర్ణాటకలోని స్వయస యూనివర్సిటీలో వచ్చే నెల 20 నుంచి 28 వరకు జరిగే సౌత్‌జోన్ గేమ్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

# సురవరం జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకం

**» కొల్లాపూర్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తా**

**» కొల్లాపూర్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం**



సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి

కొల్లాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతానికి చెందిన సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి దివంగత సురవరం సుధాకర్‌రె డ్డి జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. దివంగత సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ బుధవారం కొల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో వద్ది రాంరెడ్డి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు దివంగత సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. వద్ది రాంరెడ్డి మనువడు నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో జన్మించి జాతీయ స్థాయిలో పేరుగాంచిన భారతదేశం గర్వించదగిన తెలంగాణ బిడ్డ దివంగత సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని కొల్లాపూర్‌లో ఏర్పాటు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సురవరం జీవిత చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్న నేపథ్యంలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆయన జీవిత చరిత్రను పుస్తకాల రూపంలో ముద్రించి గ్రామాల్లో పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్ల వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ, జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండీ ఫయాజ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పగిడాల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం దివంగత నేత సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రజా నాట్యమండలి కార్యదర్శి పల్లె నర్సింహ, గాయకుడు రాజారాం ప్రకాష్ సురవరం గొప్పతనాన్ని తమ బాణీలో పాటల రూపంలో వినిపిం చారు. సీపీఐ రాష్ట్ర నాయకురాలు ఛాయాదేవి, సురవరం విజయలక్ష్మి, ఆమె తనయుడు సురవరం కపిల్, సురవరం చెల్లెలు పుష్పలత, కార్యక్ర మ సమన్వయకర్తలు కందాల రామకృష్ణ, లక్ష్మణరా వు, సామాజిక కార్యకర్త కోళ్ల వెంకటేష్, నరసింహ, నాగిరెడ్డి, పెండ్యాల బుచ్చయ్య శెట్టి, కేతూరి వెంకట రాములు, కేతూరి ధర్మతేజ, సీపీఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు పట్టణ కార్యదర్శి ఎండీ యూసుఫ్, మండల మాజీ ప్రజాప్రతి నిధులు, మునిసిపల్ మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ముంబైలో వలస కూలీ మృతి

నారాయణపేట టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నారాయణ పేట జిల్లా, నారాయణపేట మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన కూలీ ముంబైలో భవనంపై నుంచి కింద పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన కావలి యాదప్ప (48) ఉపాధి కోసం ముంబైకి వలస వెళ్లాడు. అక్కడ మేస్త్రీ పని చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఇటీవల కుమార్తె అనారోగ్యానికి గురికావడంతో గ్రా మానికి వచ్చాడు. అప్పు చేసి, కుమార్తెకు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించాడు. అప్పు తీర్చేందుకు మళ్లీ ముంబైకి వెళ్లాడు. అక్కడ బుధవారం నిర్మాణంలో ఉన్న ఓ భవనం 14వ అంతస్తులో పని చేస్తుండగా, గోవ (పని చేసేందుకు ఏర్పాటు చేసిన కట్టెలు)పై నుంచి జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

తోటి కూలీలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఆ గ్రామాలను తరలించేందుకు కసరత్తు

**» బాచారం అడవిలో పునరావాస స్థలాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు**



బాచారం అటవీ ప్రాంతాన్ని మ్యాప్‌లో చూస్తున్న ఫారెస్టు అధికారులు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో ఉన్న గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు అటవీశాఖ అధికారులు ముమ్మరంగా కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా అటవీశాఖ కల్పించనున్న వసతులను, భూములను పరిశీలించేందుకు బుధవారం వటవర్లపల్లి గ్రామస్థులు లింగాల ఎఫ్ఆర్‌వో ఈశ్వర్ ఆధ్వర్యంలో పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అభయారణ్య ప్రాంతాన్ని వీడుతున్న ప్రజలకు ఉన్న సందేహాలను ఈశ్వర్ నివృత్తి చేశారు. బాచారం గ్రామంలో నూతనంగా ఏర్పడనున్న కాలనీల్లో కల్పించనున్న మౌలిక వసతులను వటవర్లపల్లి గ్రామస్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో ఉన్న వటవర్లపల్లి, చింతలబైలు, తాటిగుండాల, కొల్లంపెంట, సార్లపల్లి గ్రామాల నుంచి మొత్తం 1088 కుటుంబాలను తరలించేందుకు కసరత్తు పూర్తి కావచ్చిందన్నారు. ఆప్షన్-1 కింద ఎంపిక చేసిన 471 కుటుంబాల వారికి రూ.15లక్షల ప్యాకేజీ ఉంటుందన్నారు. అలాగే, ఆప్షన్-2 కింద ఎంపిక చేసిన 617 కుటుంబాలు ఉండగా, వీరికి 5ఎకరాల వ్యవసాయ భూమితో పాటు 250గజాల విస్తీర్ణం గల రెండు పడకల ఇంటి నిర్మాణం చేయించి, కాలనీల్లో కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు.

ఇప్పటికే 1501 అటవీ భూములను రెవెన్యూ భూమిగా మార్చేందుకు ఎన్‌టీసీఏ ఆమోదం కూడా తెలిపిందన్నారు. రూ.92కోట్ల నిధులు మంజూరు కావడంతో త్వరలోనే పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులు నివేదిక తయారు చేస్తున్నారని అన్నారు. ఎఫ్ఎస్‌వో వెంకటేశ్, ఎఫ్‌బీవో పర్వీన్, వటవర్లపల్లి పునరావాస గ్రామ కమిటీ అధ్యక్షుడు అప్పి సాయిబాబు, సభ్యులు మక్బూద్, బాలకృష్ణ, జైపాల్, జానకిరాం, జూలియా నాయక్, పద్యానాయక్, లక్ష్మణ్, శ్యాంసుందర్, చంద్రమౌళి, రవీందర్, వినోద్, నిరంజన్, జానీ, అండాలమ్మ, చిట్టెమ్మ, మల్లమ్మ, ముసిలయ పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

**» జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్**

**» జిల్లా పోలీసు కార్యాలయాన్ని తనిఖీ చేసిన అధికారి**



తనిఖీలో అధికారులతో మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలీసులు క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. జిల్లా పోలీసు వ్యవస్థను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. బుధవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయ పరిధిలోని విభాగాలైన డీపీవో, స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్‌బీ, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ వంటి విభాగాలను పరిశీలించారు. పోలీసు రికార్డులు, రిజిస్టర్లు, ఆఫీస్ ఫైల్స్, ఆయుధ నిల్వలు, బలగాల హాజరు రిజిస్టర్, వాహనాల సంరక్షణ విధానాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో అనుసంధానం కావాలని, సకాలంలో పోలీసులు ప్రజాసమస్యలపై స్పందించాలని, ఎప్పటికప్పుడు శాంతిభద్రతలను పర్యవేక్షించినపుడే ప్రజలకు పోలీసులపై నమ్మకం పెరుగుతుందన్నారు. ఎస్పీ జానకి, అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏవో రుక్మిణి పాల్గొన్నారు.



అఖండ జ్యోతులను ఊరేగిస్తున్న భక్తులు

## చౌడేశ్వరిమాత అఖండ జ్యోతుల ఊరేగింపు

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పట్టణంలో బాపూనగర్ తొగట వీర క్షత్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అఖండ జ్యోతుల ఊరేగింపు ఖడ్గ విన్యాసాలతో, నందికోలు ఆ టలతో, భజన పాటలతో వైభవంగా నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా బాపూనగర్ చౌడేశ్వరి మాతా ఆలయం వరకు సాగింది. అంతకు ముందు అమ్మవారికి మహాభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలతో పాటు మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులు తోట వీర క్షత్రీయ సేవా సంఘం, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## విద్యుదాఘాతంతో 'జెర్రిపోతు'కు గాయాలు

**» చికిత్స చేసిన డాక్టర్ సదాశివయ్య**



విద్యుత్‌షాక్‌కు గురైన జెర్రిపోతు పాముకు చికిత్స అందిస్తున్న సర్పరక్షకుడు డాక్టర్ సదాశివయ్య

జడ్చర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో జెర్రిపోతు పాము తీవ్రంగా గాయపడింది. సర్పరక్షకుడు, జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సదాశివయ్య దానికి దానికి చికిత్స చేసి కాపాడారు. మహబూబ్‌నగర్ జడ్చర్ల పట్టణంలోని నిమ్మబావిగడ్డ వద్దనున్న శ్రీలక్ష్మీ రాజేంద్రఇండస్ట్రీస్‌లోని పవర్‌బోర్డులోకి వెళ్లిన 8 అడుగుల జెర్రిపోతు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడింది. గమనించిన ఇండస్ట్రీస్ యజమాని డాక్టర్ సదాశివయ్యకు సమాచారం అందించారు. అతడు తన తన శిష్యులు శ్రీకాంత్, శివకుమార్‌లతో అక్కడికి చేరుకున్నాడు. గాయపడిన జెర్రిపోతును జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జీవవైవిధ్య సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేశారు. అది కోలుకున్న అనంతరం సురక్షిత ప్రాంతంలో వదిలివేయనున్నట్లు డాక్టర్ సదాశివయ్య తెలిపారు.

## అవుసలి కుంటలో కాడెద్దు మృతి

లింగాల (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ కాడెద్దు చనిపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండలంలోని అవుసలికుంటలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతు పుట్ట మల్లయ్య కాడెద్దు పొలంలో మేత మేసుకుంటూ అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ఎర్త్ వైర్‌కు తాకడంతో విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. దాని విలువ రూ.60 వేలు ఉంటుందని రైతు తెలిపాడు.

## ప్రమాదవశాత్తు కూలిన బండరాళ్లు

**» పనులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తుల మృతి**

**» మృతులు వనపర్తి జిల్లావాసులు**

కోయిలకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పొట్ట కూటి కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పొలాల్లో ఉన్న బండ రాళ్లను పగులగొట్టి వచ్చిన డబ్బులతో జీవనం కొనసాగిస్తున్న వారిపై బండరాళ్ల పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలో చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై తిరుపాజీ బుధవారం తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన మౌలాలి (50), అదే జిల్లా కిష్టపురం గ్రామానికి చెందిన కురుమూర్తి(40) కలిసి మూడు సంవత్సరాలుగా కోయిలకొండ మండలంలోని వివిధ ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల్లో ఉన్న బండరాళ్లను పగులగొట్టి, వాటిని అమ్మగా వచ్చిన డబ్బుతో జీవనం కొనసాగిస్తున్నారు. మండలంలోని పల్లెమోని గుడిసెల ప్రాంతంలో గల సోమ్లిబాయి వ్యవసాయ పొలంలో ఉన్న బండరాళ్లను పగులగొట్టేందుకు మంగళవారం ఉదయం వెళ్లారు. సాయంత్రం వేళ బండను రెండుభాగాలుగా చేసి మరోపక్క బండను పగులగొడుతుండగా పగిలిన బండరాయి మీద పడటంతో మౌలాలి తలకు తీవ్రగాయాలయ్యాయి.

దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కురుమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో వారి నివాస ప్రాంతంలో ఉండే తోటి కార్మికులు వెతకగా వారి ఆచూకీ తెలిసింది. గాయాలైన కురుమూర్తిని జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మౌలాలి కి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు, భార్య ఉన్నారు. కురుమూర్తికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు, భార్య ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# చేనేత కార్మికులకు చేయూత ఏదీ.!



మగ్గంపై జరీ చీరలను నేస్తున్న గద్వాల చేనేత మహిళా కార్మికులు

(5వ పేజీ తరువాయి..)

కంచె ఏర్పాటు కోసం రూ. 50 లక్షల నిధులను విడుదల చేశారు. ఆ తర్వాత రాజశేఖర్‌రెడ్డి మరణం, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల ప్రభుత్వాలు ఏర్పడటం తెలంగాణ ఉద్యమం తీవ్రతరం కావడంతో పాలకులు దీన్ని పట్టించుకోలేదు. కానీ, 2018 జనవరి 31న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేనేత జౌళిశాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌తో రెండోసారి శంకుస్థాపన చేయించారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నా జౌళిశాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నప్పటికీ ఒక్కపైసా కూడా విడుదల కాలేదు. దీనికోసం చేనేత కార్మికులు ఎదురు చూపులతోనే గడిపేస్తున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 17 వేల మంది కార్మికులు

ఉమ్మడి జిల్లాలో దాదాపు 6 వేల వరకు మగ్గాలు ఉండగా.. అందులో 17 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. వీరందరూ గద్వాల బ్రాండ్‌తోనే జరీ చీరలు తయారు చేస్తున్నారు. రాజోలీ, అయిజ, గట్టు, గద్వాల, అలంపూర్, ఎక్లాస్‌పూర్, బూడిదపాడు, మాచర్ల, అమరచింత, కొత్తకోట, కోటకొండ తదితర ప్రాంతాలలో చేనేత మగ్గాలపై గద్వాల జరీ చీరలను తయారు చేస్తున్నారు. గద్వాల జిల్లాలోనే 3,400 జియో ట్యాగింగ్ మగ్గాలు ఉండగా 6,948 మంది చేనేత కార్మికులు ఉన్నారు. 14 చేనేత సంఘాలు ఉన్నాయి. అమరచింతలో 900, నారాయణపేటలో 1,200, మహబూబ్ నగర్‌లో 450 దాకా జియోట్యాగింగ్ కలిగిన మగ్గాలు ఉన్నాయి.

### పోటీని తట్టుకునేలా నైపుణ్య శిక్షణ ఏది

జౌళీ ఖాదీ గ్రామీణాభివృద్ధి శాఖ కార్మికులను పట్టించుకోవడం లేదు. వీరికి కాలానుగుణంగా నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు శిక్షణ ఇవ్వడంలో విఫలం అయ్యింది, హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌ల క్లస్టర్‌లను ఏర్పాటు చేయడం లేదు. దీంతో మార్కెట్లో కొత్తకొత్త డిజైన్‌లతో వచ్చే జరీచీరలకు గద్వాల జరీ చీరలు తట్టుకోవడం కష్టంగా మారింది. టె అండ్ డైతో (రంగులు అద్దేటప్పుడే వివిధ డిజైన్లతో చేయడం) తయారు చేసే పోచంపల్లి చీరల డిమాండ్‌ను తట్టుకోలేకపోతున్నది. కాలానుగునంగా మారుతున్న మహిళల అభిరుచులకు తగిన విధంగా వివిధ డిజైన్లలో గద్వాల జరీ చీరలు తయారు కావాలంటే పాతపద్ధతిలో మార్పులు చేయాలి. ఎలక్ట్రానిక్ జుకార్డ్ యంత్రాలను ఉపయోగిస్తే వివిధ డిజైన్లలో జరీ చీరలను తయారు చేయవచ్చు. ఇది ఖర్చుతో కూడుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు సబ్సిడీపై వీటిని అందించాల్సిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం నేషనల్ డెవలప్‌మెంట్ హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ ఆధ్వర్యంలో వీవర్స్ సర్వీసింగ్ సెంటర్ ద్వారా ఎలక్ట్రానిక్ జుకార్డ్ యంత్రాలను సిబ్సిడీపై అందిస్తోంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలోనే ఇచ్చింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే తప్ప గద్వాల జరీ చీరల ఉత్పత్తిని పెంచలేరు. గద్వాల జరీ చీరలకు ఉన్న డిమాండ్‌ను మాత్రం మాస్టర్ వీవర్స్ క్యాష్ చేసుకుంటున్నారు. పవర్‌లూమ్‌లో తయారు అయిన జరీ చీరలను కూడా గద్వాల హ్యాండ్‌లూమ్ చీరలుగా వినియోగదారులకు చూపించి మార్కెట్ చేసి కోట్లు సంపాదిస్తున్నారు. ఇది చేనేత కార్మికులు, వినియోగదారులకు నష్టం కలిగిస్తోంది. దీన్ని నివారించి గద్వాల జరీ చీరలకు ఉన్న గుర్తింపును కాపాడాలంటే ప్రభుత్వం చేనేత కార్మికులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

## షెడ్యూల్ ప్రకారమే!

( 5వ పేజీ తరువాయి )

జడ్పీటీసీ, 69 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు పడనున్నాయి. ఇందులో గద్వాల, గట్టు, ధరూర్, కేటిదొడ్డి, మల్దకల్ మండలాలు ఉన్నాయి. నారాయణపేట జిల్లాలో 136 ఎంపీటీసీ, 13 జడ్పీటీసీ స్థానాలు ఉండగా.. తొలి విడతలో 8 జడ్పీటీసీ, 82 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కోస్గి, కొత్తపల్లి, మద్దూరు, గుండుమాల్, దామరగిద్ద, నారాయణపేట, ధన్వాడ, మరికల్ మండలాల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. నాగర్‌కర్నూలు జిల్లాలో 214 ఎంపీటీసీ, 20 జడ్పీటీసీ స్థానాలు ఉండగా తొలి విడతలో 9 జడ్పీటీసీ, 109 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. బిజినేపల్లి, తాడూరు, నాగర్‌కర్నూలు, తిమ్మాజిపేట, తెలకపల్లి, కల్వకుర్తి, ఊర్కొండ, వెల్దండ, వంగూరు మండలాల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. వనపర్తి జిల్లాలో 133 ఎంపీటీసీ, 15 జడ్పీటీసీ స్థానాలు ఉండగా తొలి విడతలో 8 జడ్పీటీసీ, 71 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. వనపర్తి, గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల, పెద్దమందడి, ఖిల్లాఘణపూర్, పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు.

### నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి..

హైకోర్టు ఎన్నికల ప్రక్రియ నిలుపుదలకు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో నేటి నుంచి నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంపీటీసీల నామినేషన్లకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయగా జడ్పీటీసీల నామినేషన్లను ఎంపీడీఓ కార్యాలయాల్లో స్వీకరించనున్నారు. ప్రతీరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుంది. ఈ నెల 9, 10,11 తేదీల్లో మూడు రోజులపాటు నామినేషన్లు వేయడానికి అవకాశం ఉండగా 12వ తేదీన నామినేషన్ల పరిశీలన చేసి ఆ జాబితాను ప్రకటిస్తారు. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఆ తర్వాత అదే రోజు అభ్యర్థులను ఖరారు చేస్తారు. మొదటి విడత పోలింగ్ 23 తేదీన నిర్వహిస్తారు. ఎన్నికల ఫలితాలు సర్పంచు ఎన్నికల తర్వాతనే వెల్లడిస్తారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే రెండో విడతకు సంబంధించి ఈ నెల 13, 14, 15 తేదీల్లో నామినేషన్లను స్వీకరిస్తారు. 16న నామినేషన్ల పరిశీలన, 19వ తేదీ మధ్యాహ్నం వరకు రెండో విడత నామినేషన్లకు ఉపసంహరణ గడువు విధించి అదే రోజు తుది జాబితాను ప్రకటిస్తారు. 27వ తేదీన రెండో విడత పోలింగ్ జరుగనుంది.

## శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

**» రెండు గేట్ల ద్వారా 55,600 క్యూసెక్కులు దిగువకు విడుదల**

**» విద్యుత్ ఉత్పత్తి, లిఫ్టల ద్వారా మరో 72 వేల క్యూసెక్కులు**

మహబూబ్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : శ్రీశైలం ప్రాజెక్టు వరద కొనసాగుతోంది. బుధవారం ప్రాజెక్టు సైట్ వద్ద 1.03 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా రెండు గేట్లు ఎత్తి 55,600 క్యూసెక్కులను నాగార్జున సాగర్ వైపు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి, పోతిరెడ్డిపాడు, హంద్రీనివా కు మరో 72 వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది.

ఈ ఏడాది జూన్ మొదటి వారంలోనే ప్రారంభమైన వరద నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. సాధారణ వరద రోజుల కంటే గరిష్ఠ వరద రోజులు నమోదయ్యాయి. ఈ నెలాఖరు వరకు వరద ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక జూరాల ప్రాజెక్టు వద్ద 88 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా 61 వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతే మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా ఉండటంతో వచ్చిన వరదను దిగువకే వదులుతున్నారు.

క్రైం కార్నర్

## దుందుభీ నదిలో పడి వ్యక్తి మృతి



జంగయ్య (ఫైల్)

తాడూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు దుందుభీ నదిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జంగయ్య (52)కు ఇటీవల మతిస్థిమితం తప్పింది. అతడు మంగళవారం రాత్రి దుందుభీ నది వద్దకు వెళ్లి, ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. బుధవారం ఉదయం నది వద్దకు వెళ్లిన స్థానికులకు అతడి మృతదేహం కన్పించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని వెలికి తీయించి నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### బావిలో పడి మృత్యువాత



పార్వతమ్మ (ఫైల్)

ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మహిళా మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని పాపగల్ గ్రామానికి చెందిన పార్వతమ్మ (52) సోమవారం సాయంత్రం పొలానికి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గ్రామంలో తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో ఆమె మృతదేహం కనిపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. బావిలో నుంచి ఆమె మృతదేహాన్ని వెలికి తీసి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మృతురాలికి భర్త రాములు, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి..

ఇటిక్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి పురుగుల మందు తాగి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలంలోని సాతర్ల గ్రామంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఇటిక్యాల ఎస్‌ఐ కె.రవి తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన దామోదర్ గౌడ్ (35)కు గత కొంత కాలంగా మతిస్థిమితం తప్పింది. ఈ నెల 7న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## నా కూతురిది ఆత్మహత్య కాదు

- ఎవరో ఇంజక్షన్ ఇచ్చి హత్య చేశారు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన ప్రియాంక తండ్రి

గద్వాల క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : తన కుమార్తె ప్రియాంకది ఆత్మహత్య కాద ని, ఎవరో ఇంజక్షన్ ఇచ్చి హత్య చేశారని, ద ళిత యువతి ప్రియాంక తండ్రి కోలేటి రాం బాబు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆయన జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. అనంత రం ఆయన మాట్లాడుతూ గత కుమార్తె ప్రి యాంకను కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడు ప్రే మ, పెళ్లి పేరుతో మోసం చేశాడన్నారు. అత డితోనే తన పెళ్లి జరగాలని తన కుమార్తె భావించిందన్నారు. గట్టు మండలంలోని చిన్నోనిపల్లిలోని వారు కొత్తగా నిర్మిస్తున్న ఇం టికి జూలై నెలలో వెళ్లిందని తెలిపారు. ఈ నెల 3న తమ కుమార్తె ఉంటున్న ఇంటికి 15 మంది వ్యక్తులు వచ్చి గొడవ చేశారన్నారు. ఈ విషయాన్ని ప్రియాంక తమకు ఫోన్ చేసి చెప్పిందని, ఆ తర్వాత పురుగుమందు తాగిందని తెలిపారు. ఆమెను అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా, ఎలాంటి చికిత్సా చేయలేదన్నారు. ఈ నెల 4న ఉద యం 11 గంటలకు ఆసుపత్రికి వచ్చి చూడగా, ఆమె మృతి చెందిందన్నారు. అయితే అంబులెన్స్‌లో వస్తుండగా తమ కుమార్తెకు మార్గమధ్యంలో ఎవరో ఇంజక్షన్ ఇచ్చారని తెలిపారు. అది మత్తు ఇంజక్షనా, పాయిజన్ ఇంజక్షనా? తె లియాల్సి ఉందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తమకు న్యా యం చేయాలని ఎస్పీని కోరారు.

## రైతు ఆత్మహత్యాయత్నం

కోస్గి రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పొలం దారి విషయంలో దాయాదులతో వివాదం నెలకొనడంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. నారాయణపేట జిల్లా, కోస్గి ఉమ్మడి మండలంలోని అమినికుంట్ల గ్రామంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాల పెద్ద అంజిలయ్య తన పొలంలో బెండకాయల తోట సాగు చేస్తున్నాడు. అయితే అతడి పొలానికి దారి విషయంలో దాయాదులతో వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో బుధవారం పొలానికి వెళ్తున్న అతడిని దాయాదులు అడుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన అంజిలయ్య పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పురుగు మందు డబ్బాను లాక్కొని బాధితుడిని వెంటనే కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడికి చికిత్స కొనసాగుతోంది. సంఘటనపై కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

## భర్తతో గొడవ పడి.. మహిళ బలవన్మరణం

గోపాల్‌పేట, (ఏదుల) అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : భర్తతో గొడవ పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. వనపర్తి జిల్లా, ఏదుల మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రామాచారి, గీత దంపతులు వడ్రంగి పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. వారికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. మంగళవారం మధ్యాహ్నం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో క్షణికావేశానికి గురైన గీత ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఒంటిపై టర్పెంటైన్ ఆయిల్ పోసుకొని నిప్పంటించుకున్నది. మంటలకు తాళలేక కేకలు వేస్తూ బయటకు రావడంతో భర్త, చుట్టుపక్కల వారు మంటలను అర్పారు. వెంటనే వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి అన్న నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

## కొనసాగుతున్న ఐటీ సోదాలు

అలంపూరు చౌరస్తా, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వీకేర్ సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో రెండవ రోజు ఐటీ సోదాలు కొనసాగాయి. మంగళవారం ఉదయం వచ్చిన ఐటీ అధికారులు బుధవారం పొద్దుపోయో దాకా సదరు కార్యాలయంలోనే ఉన్నారు.

మంగళవారం అర్ధరాత్రి గోడౌన్‌లో తనిఖీలు చేసినట్లు తెలిసింది. పప్పు దినుసుల అక్రమ నిల్వలపై ఆరా తీసి తనిఖీలు చేసినట్లు సమాచారం. మరో రెండ్రోజుల పాటు సోదాలు జరగనున్నట్లు తెలిసింది.

## అరుదైన వ్యాధితో చిన్నారి కన్నుమూత



విహాన (ఫైల్)

గోపాల్‌పేట, (ఏదుల) అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మెదడుకు సంబంధించిన అ రుదైన వ్యాధితో ఓ చిన్నారి మృత్యువుతో పో రాడి ఓడిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, ఏదుల మండల కేంద్రానికి చెందిన కోడి గంటి రంజిత్, హేమలత దంపతులకు ఇద్ద రు కుమార్తెలున్నారు. పెద్దకుమార్తె విహాన (4) రెండు నెలల క్రితం ఆడుకుంటూ తలతిరిగి కిందపడిపోయింది. చిన్నారిని తల్లిదండ్రులు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ బాలిక అప్పటికే కోమాలోకి వెళ్లిపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. పరీ క్షలు నిర్వహించిన వైద్యులు చిన్నారికి మైటోకాండ్రియల్ వ్యాధి ఉన్నట్లు తెలిపారు. దీనికి ఎలాంటి వైద్యమూ లేదని చెప్పారు. దీంతో ఎలాగైనా తమ బిడ్డ ను దక్కించుకోవాలని వారు పలు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించా రు. కానీ ఫలితం లేకపోయింది. ఆ చిన్నారి మృత్యువుతో పోరాడుతూ బుధ వారం ఉదయం మృతి చెందింది. తమ కుమార్తె చికిత్స కోసం రూ.18 లక్షల వరకు ఖర్చు చేశామని, అయినా దక్కించుకోలేకపోయామని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

# పక్కాగా పంటల సాగు లెక్క

- క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారుల సర్వే
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు



గుండుమాల్ మండలంలో పంటల సాగు వివరాలు నమోదు చేస్తున్న ఏఈవోలు

కోస్గి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నమోదు చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. డిజిటల్ సర్వేలో భాగంగా రైతుల నుంచి వివరాలు సేకరించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. రైతులు సాగు చేసిన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. తద్వారా రైతులు పంట దిగుబడులను విక్రయించుకోవడం సులభతరం అవతుందని అధికారులు చెప్తున్నారు.

### 54 రెవెన్యూ గ్రామాల్లో సర్వే

కోస్గి డివిజన్‌లో మొత్తం 54 రెవెన్యూ గ్రామాల పరిధిలో 14 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. ఆయా క్లస్టర్లలోని గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ముందుగా గ్రామాల వారీగా సాగైన పంటల వివరాలను సేకరించి, ఆ తర్వాత యాప్‌లో నమోదు చేసేవారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల సాగు విస్తీర్ణాన్ని పరిశీలించి అప్పటికప్పుడే యాప్‌లో నమోదు చేస్తున్నారు.

### పూర్తి వివరాల సేకరణ

డిజిటల్ సర్వేలో భాగంగా క్లస్టర్ వారీగా ఏఈవోలకు కేటాయించిన గ్రామాల్లో రైతు పేరు, సర్వేనెంబరు, బ్యాంకు ఖాతా, పట్టదారు పాసుపుస్తకం, ఫోన్ నెంబర్‌తో పాటు సాగు చేసిన పంటల వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. కోస్గి మండల వ్యాప్తంగా 13,331 మంది రైతులు, 23,471 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేశారు. అందులో ఇప్పటివరకు 22 శాతం పంటల వివరాలను మాత్రమే నమోదు చేశారు. ఇంకా 18,199 ఎకరాలలో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. గుండుమాల్ మండలంలో 7,987 మంది రైతులు 13,410 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అందులో 38 శాతం వివరాల సేకరణ పూర్తయ్యింది. ఇంకా 8,250 ఎకరాల్లో పంటల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. కొత్తపల్లి మండలంలో 7,537 మంది రైతులు 12,880 ఎకరాల్లో పంటలను సాగు చేశారు. అందులో 53 శాతం మేర వివరాలు నమోదు చేశారు. ఇంకా 5,987 ఎకరాల్లో పంటల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. మద్దూర్ మండలంలో 16,443 మంది రైతులు 26,561 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అందులో 40 శాతం సర్వే పూర్తవగా, ఇంకా 15,676 ఎకరాల్లో పంటల వివరాలను నమోదు చేయాల్సి ఉంది.

### క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు

రైతులు సాగు చేసిన పంటల వివరాలను గ్రామాల వారీగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి యాప్‌లో నమోదు చేస్తున్నాం. సాగు వివరాల నమోదుతో రైతులు పంట దిగుబడులను విక్రయించుకునేందుకు, పంటలు దెబ్బ తిన్నప్పుడు పరిహారం అందించేందుకు ఉపయోగకరంగా ఉంటుంది.

- వినోద్, ఏఈవో, కోస్గి

### నమోదు చేయించుకోవాలి

రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. సాగు వివరాలను మూడేళ్ల వరుసగా నమోదు చేయించుకోకపోతే రైతు భరోసా అందదు. ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను డిజిటల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

- రామకృష్ణ, డివిజన్ వ్యవసాయశాఖ అధికారి

## రాష్ట్ర స్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

- డీఐఈవో కౌసర్ జహాన్
- ఉత్సహంగా ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన ఉమ్మడి జిల్లా అండర్-19 బాల,బాలికల జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కౌసర్ జహాన్ అన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల కబడ్డీ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లను బుధవారం ఎంపిక చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలను డీఐఈవో కౌసర్ జహాన్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపికలకు 80 మంది క్రీడాకారులు హాజరవగా, ప్రతిభ చాటిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి, కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శికు రుమూర్తిగౌడ్, ఉపాధ్యక్షుడు బాలరాజు, పీడీలు జగన్‌మోహన్‌గౌడ్, వేణుగోపాల్, మేరీ పుష్ప, శ్రీనివాసులు, రమేశ్, మోహన్, భారతి పాల్గొన్నారు.

### ఎంపికైన క్రీడాకారులు వీరే..

ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు చందు, అంజనేయులు, హర్షవర్ధన్, శ్రీకాంత్, దత్తత్రేయ, రామ్‌చరణ్, అనిల్‌కుమార్, హన్మంతు, గౌతమ్, విక్రమ్‌నాయక్, రాజు, భాస్కర్ ఎంపికయ్యారు. బాలికల జట్టుకు గంగ, భవాని, నందిని, సింధుజ, శివాని, జోష్న, ఎస్. సింధు, నాగప్రత్యూష, ఇందీశ్వరి, గాయత్రి, గౌరి, మౌనిక ఎంపికయ్యారు.

## ఫ్లెక్సీ తొలగింపుపై వివాదం

- యువకుడిపై చేయి చేసుకున్న సీఐ
- పోలీసుస్టేషన్ ముందు బీజేపీ నాయకుల ధర్నా



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

వెల్దండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ తొలగింపు వివాదానికి దారి తీసింది. ఈ సందర్భంగా సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి గ్రామానికి చెందిన ఓ యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కొట్టడం ఉద్రిక్తతకు దారి తీసింది. దసరా పండుగ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఈనెల 4న తొలగించారు. అందుకు ఓ కాంగ్రెస్ నాయకుడి ప్రమేయం ఉందన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో సదరు నాయకుడు గ్రామానికి చెందిన గజ్జె హరిప్రసాద్‌గౌడ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బుధవారం అతడిని స్టేషన్‌కు పిలిపించగా, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి అతడిపై చేయి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు పోలీసు స్టేషన్‌కు చేరుకొని ఆందోళన చేపట్టారు. సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అక్కడకు చేరుకొని సీఐతో చర్చించారు. ఇరువురికి సర్దిచెప్పి ఆందోళనను విరమింపచేశారు. ఆందోళనలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చక్రవర్తిగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ రాజేందర్‌రెడ్డి, ఆచారి మిత్రమండలి అధ్యక్షుడు పరమేశ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, నాయకులు యాదయ్య, దేవేందర్, వంశీగౌడ్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడా పోటీలకు కొల్లాపూర్ క్రీడాకారిణి

- అభినందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీకి ఎంపికైన క్రీడాకారిణి దీపికను కొల్లాపూర్‌లో సన్మానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని దీపిక ఎంపికయ్యింది. గత నెల 22 నుంచి 24వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లా, నెల్లికుదురులో నిర్వహించిన 44వ జూనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు తరపున ఆడి, క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. ఈ సందర్భంగా ఆమెతో పాటు, విశ్రాంత పీఈటీ గోపాలంలను బుధవారం రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ ధర్మతేజ సహకారంతో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా విశ్రాంత పీఈటీ గోపాలం మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్‌లో నవంబర్ 5 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో దీపిక పాల్గొంటుందని తెలిపారు. అలాగే నార్లాపూర్ గ్రామ పంచాయతీలో మాజీ సర్పంచ్ చిట్టెమ్మ వెంకటస్వామి ఆధ్వర్యంలో క్రీడాకారిణి దీపి కను ఘనంగా సన్మానించారు. కొల్లాపూర్ ఎస్‌ఐ హరికేష్ తన ఛాంబర్‌లో ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నా యకులు చందర్ నాయక్, రామన్ గౌడ్, వెంకటస్వామి, మున్నూరు నిరంజన్, జగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## భార్య హత్య కేసులో భర్త అరెస్టు

- డీఎస్పీ నల్లపు లింగయ్య




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నల్లపు లింగయ్య

మక్తల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : భార్యను కత్తితో పొడిచి హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. కేసు వివరాలను మక్తల్ పోలీసుస్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సత్యవార్ గ్రామానికి చెందిన వినోదకు, కర్నూల్ జిల్లాకు చెందిన కృష్ణారెడ్డితో 10 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. పెళ్లయిన కొద్ది రోజుల తర్వాత వారు హైదరాబాద్‌కు వెళ్లారు. దంపతుల మధ్య తరచూ గొడవ జరుగుతుండటంతో, పెద్దలు పలుమార్లు పంచాయితీలు నిర్వహించి సర్దిచెప్పారు. అయినా ఫలితం లేకపోవడంతో భార్య వినోద కొన్నేళ్ల నుంచి సత్యవార్ గ్రామంలోని తన తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. కూలీ పనులు చేసుకుంటూ, తన ఉమారుడిని మక్తల్ పట్టణంలో చదివిస్తోంది.

భర్త కృష్ణారెడ్డి ఆమెతో ఫోన్‌లో మాట్లాడేవాడు. అప్పుడప్పుడూ గ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. తాను ఫోన్ చేసినప్పుడు, బిజీ వస్తే ఎవరితో మాట్లాడుతున్నావంటూ గొడవ పడేవాడు. దీనికి తోడు తాగుడుకు బానిసై ఆమెను మరింత వేధిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో గత నెల 27న అతడు సత్యవార్ గ్రామానికి వచ్చాడు. భార్య, కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై దత్తాత్రేయస్వామి ఆలయానికి వెళ్లాడు. ఈ నెల 3న బంధువులతో కలిసి పొలానికి వెళ్లాడు. అక్కడ భోజనం చేసిన తర్వాత ద్విచక్రవాహనం టైర్లలో గాలి తక్కువగా ఉందని కుమారుడిని అత్తమామల వెంట పంపించాడు. భార్యను ద్విచ క్రవాహనంపై ఎక్కించుకొని కొంతదూరం తీసుకెళ్లాడు.

తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె కడుపులో పొడిచాడు. చేయి అడ్డుగా పెట్టడంతో ఆమె చేతిపైనా పొడిచాడు. ఆ తర్వాత గొంతు కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. సంఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు, బుధవారం భూత్పూర్ క్రాస్‌రోడ్ వద్ద నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

విలేకరుల సమావేశంలో సీఐ రాంలాల్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, మాగనూరు ఎస్‌ఐ అశోక్, నరేశ్, శ్రీకాంత్, శశిధర్‌గౌడ్, శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా జిల్లా తైక్వాండో జట్ల ఎంపికలు



ఉమ్మడి జిల్లా తైక్వాండో పోటీలకు ఎంపికైన మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా అండర్-14, 17, 19 బాల, బాలికల జట్ల ఎంపికలను బుధవారం నిర్వహించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీఐఈవో కౌసర్ జహాన్ ప్రారంభించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో గురువారం నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా పోటీలకు 15 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి తెలిపారు. టోర్నీలో ప్రతిభ చాటిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు జగన్‌మోహన్‌గౌడ్, వేణుగోపాల్, తైక్వాండో కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరు ఆర్టీసీని ఆదరించాలి

- ఆర్ఎం సంతోష్‌కుమార్



లక్కీ డ్రా తీస్తున్న ఆర్టీవో రఘుకుమార్

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులను ప్రతీ ఒక్కరు ఆదరించాలని మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో ఆర్ఎం సంతోష్‌కుమార్ కోరారు. గత నెల 26 నుండి ఈ నెల 6వ తేదీ వరకు లగ్జరీ బస్సులలో ప్రయాణం చేసిన వారు తమ టికెట్లను బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్‌లో వేశారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమానికి ఆర్టీవో రఘుకుమార్ ముఖ్య అతిథిగా హాజరై డ్రా తీశారు. మొదటి బహుమతిని శివశంకర్, ద్వితీయ బహుమతిని బిందు, మూడో బహుమతిని మోక్షజ్ఞ సొంతం చేసుకున్నారు. వారికి వరుసగా రూ. 25 వేలు, రూ.15 వేలు, రూ. 10 వేలు బహూకరించనున్నారు. డ్రా టికెట్ మీద రాసిన అడ్రస్ ప్రకారం వారి సమాచారం అందించి త్వరలో వారికి బహుమతులను అందించనున్నారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ ఉద్యోగులందరి సహకారంతో దసరా పండుగ కలెక్షన్లలో మహబూబ్‌నగర్ ఉమ్మడి డిపోకు మొదటి స్థానం లభించిందన్నారు. ప్రయాణికులను ప్రోత్సహించేందుకు లక్కీ డ్రా నిర్వహించి బహుమతులు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీవీఎం లక్ష్మీధర్మ, మహబూబ్‌నగర్ డీఎం సుజాత, ప్రయాణికులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో రైతుపై దాడి

కృష్ణ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ వ్యక్తి రైతుపై దాడి చేశాడు. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని చేగుంట గ్రామంలో బుధవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతు కుర్వ కిరప్ప తన పొలంలో పని చేసుకుంటూ ఉండగా, మద్యం మత్తులో ఉన్న బురుజు హనుమంతు అనే వ్యక్తి దాడి చేశాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులకు పిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం

ఆత్మకూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : బజారుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగి రాలేదు. సంఘటనపై ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరులోని భార్గవీనగర్ కాలనీకి చెందిన ముష్టి విష్ణువర్ధన్ మంగళవారం సాయంత్రం 4.30 సమయంలో బజారుకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడికి ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్ వచ్చింది. ఈ విషయంపై అతడి భార్య పల్లవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..

## ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నాం

**- బ్రహ్మచారి, ఎంపీడీవో, వంగూరు**



వంగూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీవో బ్రహ్మచారి తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరాలను తెలియజేశారు.

**మండలంలో ఎన్ని ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి ?**

జడ్పీటీసీతో పాటు 10 ఎంపీటీసీ స్థానాలకు, 27 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

**ఎన్నికల సిబ్బంది ఎంత మందిని నియమించనున్నారు ?**

ఎన్నికల నిర్వహణలో మండలంలో 365 పోలింగ్ సిబ్బందిని నియమించాం. ఆర్వోలకు ఏఆర్‌ఓలకు, ఎంసీసీలకు శిక్షణ కూడా ఇచ్చాం.

**మండలంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు ?**

మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాలలో మొత్తం ఓటర్ల సంఖ్య 33,488 మంది. ఇందులో పురుషులు-16,488, స్త్రీలు- 17,000 మంది ఓటర్లు ఉన్నారు.

**మండలంలో ఎన్ని సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు ?**

స్థానిక తహసీల్దార్, ఎస్‌ఐ సమావేశం ఏర్పాటు చేసి సమస్యాత్మక, సున్నిత, అతి సున్నిత గ్రామాలను గుర్తించి, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తాం. ఆయా గ్రామాలలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తాం.

న్యూస్ బాక్స్

### నేడు నామినేషన్ల ప్రక్రియ

**- ఎంపీడీవో శంకర్‌నాయక్**

చారకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ఉదయం 11 గంటలకు మండలంలోని ఒక జడ్పీటీసీ, ఆరు ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ప్రారంబానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరుకావాలని అన్నారు. నామినేషన్ల దాఖలు తేదీ ఈనెల 9 నుంచి 11 వరకు మూడు రోజుల ఉంటుందని సమయం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

### నేడు నామినేషన్లు : ఎంపీడీవో

తిమ్మాజిపేట : నేటి నుంచి స్థానిక ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. తిమ్మాజిపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆమె బుధవారం మాట్లాడుతూ ఎంపీటీసీలుగా పోటీ చేసే అభ్యర్థులు వ్యవసాయ గ్రామపంచాయతీ కార్యాలయాలు, జడ్పీహెచ్‌ఎస్‌లల్లో తమ నామినేషన్లు పారాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా జడ్పీటీసీగా పోటీ చేసే అభ్యర్థులు మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు నిబంధనలు పాటించాలన్నారు.

### టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడిగా భవండ్ల వెంకటేశ్



టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు భవండ్ల వెంకటేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కల్వకుర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణానికి చెందిన భవండ్ల వెంకటేశ్ టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని టీఎన్‌జీవో కేంద్ర కార్యాలయంలో నాగర్‌కర్నూల్ జిల్లా టీఎన్‌జీవో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా వరుసగా మూడవసారి లయన్ వెంకటేశ్ ఎన్నిక కావడంపై నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

### పంటలో కీటకాల నివారణకు జాగ్రత్తలు

**- రావేఫ్ విద్యార్థినులు**

తిమ్మాజిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి, మి రప పంటలో వచ్చే కీటకాల ని వారణ కోసం జాగ్రత్తలు తప్పని సరిగా పాటించాలని వనపర్తి వ్య వసాయ కళాశాల విద్యార్థినులు హిమబిందు, ఝాన్సీరాణి, జానకి, అలేఖ్య, శిరీష, అశ్వినిలు అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని గొరిటలో రాఘవాచారి అనే రైతు తన వ్యవసాయ పొలంలో వేసిన వరి, మిరప పంటల్లో బుధవారం రావేఫ్ విద్యార్థినులు క్షేత్ర ప్రదర్శన నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. పెరోమోన్ ట్రాప్స్ పొలంలోని పంట మధ్యలో ఏర్పాటు చేయడంతో కీటకాలు అందులో చిక్కుకుంటాయన్నారు. రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అధిక లాభాలు చేకూరుతాయన్నారు.

## అధ్వానంగా రహదారులు

**- మరమ్మతులకు నోచుకోక అవస్థ**

**- అడుగులోతు నీళ్లలో నడక యాతన**



బస్టాండ్ ఎదురుగా గుంతలమయంగా మారిన రహదారి

తెలకపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వర్షం వచ్చిందంటే చాలు రహదారులు గుంతలమయం అవుతున్నాయి. మరమ్మతులకు నోచుకోక అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లపై ప్రయాణించాలంటేనే వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఈ గుంతలలో బైక్‌లపై వెళ్లేవారు అనేక సందర్భాల్లో అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యారు. గతంలో స్వామి వివేకానంద చౌరస్తాలో గుంతలు పడితే తూతూ మంత్రంగా డోజర్‌తో అటు ఇటు డోజింగ్ చేశారు తప్ప మొరంతో మరమ్మతులు చేపట్టలేదు. బస్టాండ్ ఎదురుగా ఉన్న రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు మడుగులను తలపిస్తున్నాయి. ఈ రహదారిలో ఫంక్షన్ హాల్స్, ఇతర వాణిజ్యసముదాయాలు ఉన్నా ఇటువైపు కనీసంమొర్రం కూడా పోయడం లేదు. మండల కేంద్రంలోనే కాకుండా మండల పరిధిలోని వట్టిపల్లితండా, పెద్దపల్లి, పెద్దూరు, నెల్లికుదురు, దాచుపల్లి తదితర గ్రామాల్లో కూడా అం తర్గత రహదారులు గుంతలు ఏర్పడి నడవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతు న్నారు.

**గుంతల మయంగా దారులు**



అంతర్గత రహదారులు గుంతలమయంగా మారి నడవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్లకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు వెంటనే స్పందించి అంతర్గత రహదారులను మరమ్మతు చేయాలి. ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలి.

**- శివ, తెలకపల్లి**

## హాస్టల్ వర్కర్ల పెండింగ్ జీతాలు చెల్లించాలి

**- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్**



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హాస్టల్ వర్కర్లు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో హాస్టల్ వర్కర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్.శ్రీనివాస్ మాట్లాడు తూ జిల్లాలో ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో పని చే స్తున్న అవుట్ సోర్సింగ్ వర్కర్లకు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని, వాటిని కూడా సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి జిల్లాలోని హాస్టల్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడంతో పాటు కనీస వేతనాలు రూ.26 లక్షలకు పెంచి ఈఎస్‌ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హాస్టల్ వర్కర్లు యాదగిరి, నాగార్జున, హరిబాబు, రామస్వామి, కిరణ్, బాలకృష్ణ, జానకిరాములు, అరుణ, నిరంజనమ్మ, పురుషోత్తం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలి

**- జిల్లా వైద్యాధికారి రవికుమార్**



వెల్దండ ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

వెల్దండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి రవికుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను, హాజరుపట్టికను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎంఎంఎస్ కార్యాలయంలో తాత్కాలికంగా ఆస్పత్రి కొనసాగుతోందని, దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. సొంత భవనంలోకి మారేందుకు అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం మండలంలోని కుప్పగండ్ల సబ్‌సెంటర్‌ను సందర్శించి ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ సింధు, సిబ్బంది అనిత, లక్ష్మణ్ ఉన్నారు.

## వృద్ధులకు సేవలందించడం అభినందనీయం

**- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నసీం సుల్తానా**



జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నసీం సుల్తానాను సన్మానిస్తున్న వృద్ధాశ్రమ నిర్వాహకులు

కల్వకుర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులకు సేవలందించడం అభినందనీయమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీసెక్రటరీ నసీం సుల్తానా అన్నారు. కల్వకుర్తి పట్టణంలో డీడబ్ల్యూవో, ప్రజల భాగస్వామ్య సంస్థల సంయుక్తంగా నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు ఆమె పంపిణీ చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. వృద్ధాప్యంలో ఉన్న వారిని చేరదీసి ఆదరించడం అభినందనీయమని పేర్కొన్నారు. వృద్ధుల హక్కులను కాపాడడంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు పి.వెంకటయ్య, వృద్ధాశ్రమ కో ఆర్డినేటర్ బి.పద్మ, యోగా టీచర్ సునంద, సిబ్బంది రజిత, వృద్ధులు, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**- యువజన సంఘాల నాయకులు**

తెలకపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు తెలకపల్లి మండల పరిధిలో సాగు చేస్తున్న వేల ఎకరాల పంటలు దెబ్బతిన్నాయని, రైతులకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని రైతులకు మద్దతుగా బుధవారం యువజన సంఘాల నాయకులు తహసీల్దార్ జాకిర్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. సాయి ప్రభాస్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా పత్తి, మిరప, వరి, మొక్కజొన్న ఉద్యాన పంటలు వానలకు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయన్నారు. ఒక ఎకరా పత్తి సాగు చేయడానికి సుమారు రూ.40వేల పెట్టుబడిని రైతులు అప్పు చేసి వెచ్చించారని తెలిపారు. 10క్వింటాలు రావాల్సిన దిగుబడి 2-3 క్వింటాలు కూడా రావడం లేదని, రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డపాకుల శివశంకర్ మాట్లాడుతూ తహసీల్దార్ సమీక్ష నిర్వహించి నష్టాన్ని అంచనా వేసి జిల్లా అధికారులకు తెలియజేసి రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు అంకూరి రాజు, ఇదమయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సీజేఐపై దాడికి కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన

బిజినేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : భారత సర్వోన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడిని భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంపల్లి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో బిజినేపల్లి మండల కేంద్రంలోని పూలే అంబేడ్కర్ చౌరస్తాలో సీజేఐ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కుట్రలో భాగమే జస్టిస్ గవాయ్‌పై దాడి జరిగిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నం చేసిన నిందితుడు కిషోర్‌దాస్‌ను అరెస్టు చేసిన వెంటనే విడుదల చేయడం దుర్మార్గమన్నారు. నిందితునిపై తాత్కాలిక చర్యలు తీసుకోవడం జమంజసం కాదని, వెంటనే తిరిగి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సత్యనారాయణ, హనుమంతు, వెంకటయ్య, రాములు, సుధాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఆట వస్తువుల అందజేత

**రూ.1.5 లక్షల ఖర్చుతో దాతృత్వం చాటిన పూర్వ విద్యార్థి**



పాఠశాలకు ఇచ్చిన ఊయలను ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకట్ నారాయణ, కుటుంబ సభ్యులు

మన్ననూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : తాను బాల్యంలో చదువుకున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.1.5 లక్ష ఖర్చుతో ఆటవస్తువులను అందజేసి పూర్వ విద్యార్థి డాక్టర్ వెంకట్‌నారాయణ దాతృత్వాన్ని చాటుకున్నాడు. పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన వస్తువులను సమ కూర్చాడు. రంగులరాట్నం, జారుడు బండ, ఊయలలు, డ్యూయల్ డెస్కులను బుధవారం అందజేశారు. తాను చదువుకున్న పాఠశాలకు వస్తువులను అందజేయడం తృప్తినిచ్చిందని డాక్టర్ వెంకట్‌నారాయణ అన్నారు. దాతకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంఈఓ బాలకిషన్, పాఠశాల క మిటీ చైర్మన్ బక్కమ్మ, పాఠశాల సముదాయ హెచ్‌ఎంలు సిద్దార్థమహాదేవ్, శిల్ప పాల్గొన్నారు.

### పెద్దకొత్తపల్లి ఎస్సీ జనరల్ సీటు కోసం మంత్రి జూపల్లికి వినతి

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి జడ్పీటీసీ ఎస్సీ జనరల్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ మండలంలోని చంద్రకల్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఎదిరేపల్లి కాశన్న బుధవారం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తనకు అవకాశం కల్పించాలని ఆయన మంత్రిని కోరారు.

### జంగమోనిపల్లిని కలెక్టర్, ఎస్పీ సందర్శించాలి : కేవీపీఎస్

తెలకపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమోనపల్లి గ్రామాన్ని కలెక్టర్, ఎస్పీలు సందర్శించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ముందు కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కాశన్న మాట్లాడుతూ జంగమోనిపల్లిలో ఇటీవల జరిగిన దుర్గామాత ఉత్సవాల్లో దళితులను దర్శనానికి రానివ్వకుండా అడ్డుకున్న స్వామి, కృష్ణయ్య, రాములు, కొట్టే శ్రీను, జాలం బాలస్వామి, జాలం తిరుపతమ్మ తదితరులపై చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేఖర్, శ్రీశైలం, శివ, చెన్నయ్య,రాములు, కృష్ణ, చంద్రయ్య పాల్గొన్నారు.

### ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తాం : ఎస్‌ఐ

తిమ్మాజిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని స్థానిక ఎస్‌ఐ హరిప్రసాద్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ సమీపంలో ప్రధాన రహదారిపై బుధవారం ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని తనిఖీలు చేపడుతున్నామన్నారు. వాహనాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా డబ్బులు మద్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామని, రూ.50వేలకు మించి డబ్బులు తీసుకుపోవద్దని, అంతకుమించి ఉంటే అందుకు సంబంధించిన రసీదులు చూపించాలన్నారు. రసీదులు చూపించని పక్షంలో వాహనాలు సీజ్ చేయడం తప్పనిసరి అన్నారు. ఏఎస్‌ఐ ప్రిసిల్లా, సిబ్బంది కుమార్, శరత్‌గౌడ్ పాల్గొన్నారు.

### పౌష్టికాహారం తీసుకోవాలి

మన్ననూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చెంచులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని పీఎం జన్‌మన్ వైద్యాధికారి డాక్టర్ మోహన్‌పాల్ నాయక్ అన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని మల్లాపూర్ పెంటలో పీఎం జన్‌మన్ సంచార వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. గర్భిణులకు, చిన్నారులకు టీకాలు వేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడబోసిన నీటిని తాగాలని, జ్వరం వస్తే స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. చెంచులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు కావ్య, ల్యాబ్ టెక్నీషన్ రాజు, ఏఎన్‌ఎం పద్మ, ఆరోగ్య సహాయకులు అంజి, ఆంజనేయులు పాల్గొన్నారు.

### వేరుశనగ విత్తనాల పంపిణీ

బల్మూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వంద శాతం ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం గతంలోనే ప్రకటించిందని మండల వ్యవసాయ అధికారి కోనేటి నరేష్, ప్రాథమిక సహకార బ్యాంకు కార్యనిర్వహణ అధికారి రాజావర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండనాగుల, తుమ్మన్‌పేట గ్రామాల్లో వందశాతం బుధవారం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేయడానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 1250మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

### మందకొడిగా దరఖాస్తులు

నాగర్‌కర్నూల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మద్యం దుకాణాలకు సంబంధించిన టెండర్లకు దరఖాస్తులు ఎక్సైజ్‌శాఖకు మందకొడిగా అందుతున్నాయి. కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో మొత్తం 5సర్కిళ్ల పరిధిలో 67 మద్యం దుకాణాలు ఉన్నాయి. గత నెల 27 నుంచి ఈనెల 18 వరకు దరఖాస్తులను స్వీ కరించే గడువు విధించగా ఇప్పటి వరకు కేవలం 41దరఖాస్తులు మాత్రమే ఎక్సైజ్ శాఖకు అందాయి. అచ్చంపేటలో ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా నమోదు కాలేదు.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**- కలెక్టర్ బదావత్ సంతోష్**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : తొలి విడతలో 115 ఎంపీటీసీ, 10 జడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణికుముదిని ఇతర ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములుతో కలిసి ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌లు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో తొలి విడతలో జరిగే 115ఎంపీటీసీ, 10 జడ్పీటీసీ స్థానాలకు జరిగే ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీలకు సంబంధించి మొదటి విడతలో 115 ఎంపీటీసీ, 10 జడ్పీటీసీ స్థానాలకు జరిగే ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వివరించారు. ప్రతీ మండల కేంద్రంలో నిర్వహించే ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నేడు ఎన్నికల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు.

## ఎమ్మెల్యే కశిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

చారకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి పంచాయతీలోని తూర్పు తండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మణ్ నాయక్, శివలాల్, భగవాన్‌లతో పాటు 10 మంది బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## పత్తి చేను పనులకు పిల్లలను తీసుకెళ్తే కఠిన చర్యలు

**- వాహనదారులను హెచ్చరించిన ఎస్‌ఐ వెంకటేశ్‌గౌడ్**

లింగాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పత్తి చేలల్లో పనులకు పిల్లలను తీసుకెళ్తే కఠిన చర్యలు తప్పవని ప్రైవేట్ వాహన యజమానులను, డ్రైవర్లను ఎస్‌ఐ వెంకటేశ్‌గౌడ్ హెచ్చరించారు. పత్తి చేనులో పనుల నిమిత్తం సామర్థ్యానికి మించి బాలకార్మికులను. విద్యార్థులను ఎక్కించుకుని వెళ్తుండడంతో ఎస్‌ఐ రెండవ రోజు బుధవారం బాకారం గ్రామంలోని కోమటికుంట వెళ్లే రోడ్డు వద్ద ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. దసరా సెలవులు ముగిసినప్పటికీ పాఠశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులను పత్తి చేను యజమానులు, ప్రైవేట్ వాహనదారులు డబ్బులను ఆశ చూపి ప్రతీ రోజు పిల్లలను పత్తి చేనులో పనులకు తీసుకెళ్తున్నారని అన్నారు. కొల్లాపూర్ మండలం ఎల్లూరు, నార్లాపూర్, ముక్కిడిగుండం ప్రాంతాల నుంచి లింగాల మీదుగా తెలకపల్లి మండలం జంగమోనిపల్లి, గౌరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు పత్తి చేనులో పనుల కోసం వెళ్తున్న 30మంది విద్యార్థులను వారి స్వగ్రామాలకు పంపించారు. తనిఖీల్లో కానిస్టేబుల్ బాలరాజు, కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కో ఆర్డినేటర్లు శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

## హామీలు విస్మరిస్తే సీఎంను ప్రజలు క్షమించరు

**- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్**



కల్వకుర్తిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి) : సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను విస్మరిస్తే ప్రజలు క్షమించరని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ హెచ్చరించారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు బాకీలు చెల్లించకుంటే స్థానిక ఎన్నికల్లో తనకు గుణపాఠం తప్పదని ఆయన పేర్కొన్నారు. గుర్కా జైపాల్‌యాదవ్ బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలుపర్చడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలంటే అఖిలపక్షాన్ని తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని కేఎల్‌ఐ, పీఆర్‌ఎల్‌ఐలను పూర్తి చేస్తే నియోజకవర్గానికి సాగునీరు పూర్తి స్థాయిలో అందుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో కల్వకుర్తి మాజీ మునిసి పల్ చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ వైస్ చైర్మన్ షాహీద్, కల్వకుర్తి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ ద్యాప విజితారెడ్డి, నాయకులు సూర్యప్రకాశ్‌రావు, ఎముక జంగయ్య, మనోహర్‌రెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, రామకృష్ణ చిన్న, నాయకులు పాల్గొన్నారు.

**మునిసిపల్ ప్లాట్లను కాపాడాలి**

కల్వకుర్తి పట్టణంలోని గతంలో ఉన్న జీపీ ప్లాట్లను రెండు నెలల క్రితం ఒకరు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కల్వకుర్తి మాజీ మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తెలిపారు. పట్టణంలోని సర్వే నెంబరు 57లో 750గజాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. గతంలో మునిసిపల్ ఆధ్వర్యంలో మునిసిపల్ ప్లాట్లకు ఫినిషింగ్ చేశామని తెలిపారు.

## కష్టంగా ఉన్నా ఇష్టంగా చదవాలి

**- ఇంటర్ విద్య నోడల్ అధికారి వెంకటరమణ**



కళాశాల ఆవరణలో జ్యోతి వెలిగిస్తున్న ఇంటర్ విద్య నోడల్ అధికారి వెంకటరమణ

కోడేరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టంగా ఉన్నా ఇష్టంగా చదవాలని ఇంటర్ విద్య నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో నూతన విద్యార్థులకు స్వాగత సమావేశం కళాశాల ప్రిన్సిపాల్ భగవేని నరసింహులు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. నోడల్ అధికారి మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్ విద్య చాలా కీలకమని అన్నారు. మొదట జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఇంటర్ విద్య, నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరి ఎమ్మె నిరంజన్, ఇటీవల డివిజనల్ అకౌంట్ ఆఫీసర్‌గా టీజీపీఎస్సీ ద్వారా ఎన్నికైన విస్లాబాద్ రాజు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక



మాజీ ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

కోడేరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు జమ్ముల భీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారంతా బుధవారం అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సర్పంచు కొమ్మ సత్యం యాదవ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలల్లో దాగివున్న కళలను వెలికి తీద్దాం

**- జిల్లా బాలోత్సవ కమిటీ కన్వీనర్ చెన్నయ్య**

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బాలల్లో దాగివున్న సృజనాత్మక కళలను వెలికి తీద్దామని బాలోత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ చెన్నయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు మందిరంలో నిర్వహించిన సమావేశంలో కందనూలు డివిజన్ బాలోత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కందనూలు బాలోత్సవ కమిటీ కన్వీనర్‌గా బి.నరసింహారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా డి.రాములు, ముచ్చర్ల దినకర్, గుడిపల్లి నిరంజన్, కో కన్వీనర్స్‌గా ఇద్రిస్, భీముడు, మురళీధర్‌రావు, కోశాధికారిగా రామకృష్ణ, సభ్యులుగా టి.రాజశేఖర్‌రావు, సురేష్‌బాబు, గురుబ్రహ్మం, తిరుపతయ్య, గౌస్‌పాషా, శ్రీనివాసచారి, చాంద్ పాషా, యాదమ్మలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ చెన్నయ్య మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు, బాలలు తమ చదువులో నిమగ్నమై వివిధ కళారూప నైపుణ్యాల్లో వెనుకబాటులో ఉంటున్నారు. జిల్లాలో బాలోత్సవాలు నిర్వహించి చిన్నారులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని కందనూలు బాలోత్సవ కమిటీ అభిప్రాయపడిందన్నారు. చిత్రలేఖనం, గానం, కథలు, కవితలు, నాట్యం తదితర అంశాల్లో బాలోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బాలోత్సవ కమిటీ జిల్లా సహ కన్వీనర్లు వెంకటయ్య, వెంకటేశ్వర్లు, సలహాదారు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.